నాట్య నీరాజనం



తిరుపతికి చెందిన సిటిజన్ వెల్ఫేర్ ఫోరం, ప్రైడ్ ఇండియా కల్చరల్స్ సంయుక్త నిర్వహణలో శనివారం మహతి కళావేదికలో జరిగిన అయోధ్య రాముడికి నాట్యనీరాజనం కార్యక్రమం కళాభిమానులను అలరించింది. చిన్నారులు మొదలుకుని పెద్దలవరకు నృత్య కళాకారులు జానపద, సంప్రదాయ ప్రదర్శనలిచ్చారు. ఆదివారం కూడా ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నాట్యనీరాజనం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఎం.జి.బాలాజి, కోలా వెంకటేశ్వరరావు తెలిపారు. - తిరుపతి కల్చరల్



గరుడుడిపై గోవిందుడు

తిరుమల క్షేత్రంలో శనివారం పౌర్ణమి గరుడసేవ కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేక ఆభరణాలు, పుష్పాలంకరణలో మలయప్పస్వామిని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి వాహనమండపంలో సిద్ధం చేసిన గరుడ వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ మలయప్ప స్వామి గరుడుడిపై నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



గోపూజలో హోంమంత్రి

శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం రాత్రి తిరుమలకొచ్చారు. అంతకుముందు అలిపిరిలో సప్తగోప్రదక్షిణ మందిరానికి వెళ్లిన ఆమె వేణుగోపాలస్వామిని దర్శించుకుని గోపూజలో పాల్గొన్నారు. తర్వాత గోవులకు గ్రాసం అందించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడ సంప్రదాయబద్ధంగా గోపూజ చేయడం చాలా సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సిబ్బంది తక్కువ.... పనిభారం ఎక్కువ

డబుల్ డ్యూటీలతో విసిగిపోతున్న వైనం

రెండేళ్లుగా పెరిగిపోతున్న ఆన్‌లైన్ నేరాలు



పాపం పోలీసులు!

తిరుపతి(నేరవిభాగం), జూన్ 22 : పోలీసులపై రోజురోజుకూ పనిభారం పెరిగిపోతోంది. సిబ్బంది లేమితో షిఫ్టుల మీద షిఫ్టులు డ్యూటీ వేస్తుండడంతో పని భారం మోయలేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో వున్న సిబ్బంది పైనే పనిభారం పెరుగుతోంది. రాష్ట్రంలో తిరుపతి పోలీసు జిల్లా అతి పెద్దది కావడమే కాక వీవీఐపీల తాకిడి కూడా ఎక్కువగా వున్న ప్రాంతమిది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం వీఐపీలు ఎక్కువగా వస్తుంటారు. తిరుపతి జిల్లాలో ప్రస్తుతం తొమ్మిది సబ్ డివిజన్లు, 10 సర్కిళ్ళు, 54 పోలీసు స్టేషన్లు వున్నాయి. ఎస్పీ నేతృత్వంలో నలుగురు అదనపు ఎస్పీలు, 10మంది డీఎస్పీలు, 50మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, దాదాపు 70మంది ఎస్‌ఐలు, 100 మంది ఏఎస్‌ఐలు, 200 మంది హెడ్‌కానిస్టేబుళ్ళు, 2000 మంది కానిస్టేబుళ్ళు, 1000 మంది హోంగార్డులు ఇక్కడ పనిచేయాల్సి వుండగా తిరుమల ఏఎస్పీ పోస్టు ఖాళీగా వుంది.దీంతో అక్కడ జరుగుతున్న నేరాలు, టీటీడీతో సమన్వయం చేయడం తదితరాల్లో సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడింది.తిరుమల క్రైం, ట్రాఫిక్, శాంతి భద్రతల స్టేషన్లను సిబ్బంది కొరత వేడిస్తోంది. ఒక్కో స్టేషన్‌కు సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ఆరుగురు ఏఎస్‌ఐలు, కనీసం 25 మంది సిబ్బంది అవసరముంది.అయితే సిబ్బంది తక్కువుండడంతో డబుల్ డ్యూటీలు చేయలేక అల్లాడిపోతున్నారు.ప్రస్తుతం తిరుపతి క్రైం ఏఎస్పీని తిరుమలకు ఇన్‌చార్జిగా నియమించారు.తిరుపతి క్రైం స్టేషన్‌లో రెండు డీఎస్పీ పోస్టులు ఖాళీగా వున్నాయి. ఇక్కడ కూడా తాత్కాలికంగా రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్సులో డీఎస్పీగా వున్న రవికుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. చంద్రగిరి డీఎస్పీ పోస్టు ఖాళీగా వుంది.ఎస్పీ కార్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న ఇద్దరు డీఎస్పీల్లో ఒకరిని ట్రాఫిక్‌కు, మరొకరిని దిశ పోలీసు స్టేషన్లకు ఇన్‌చార్జిలుగా నియమించారు.దీంతో శాంతి భద్రతల పర్యవేక్షణ కొరవడింది.తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్ళూరుపేట, గూడూరు, తిరుమల, తిరుపతి క్రైం, దిశ, ట్రాఫిక్ వంటి స్టేషన్లకు కనీసం 30 మంది సిబ్బంది అవసరం వుంది. ఈస్ట్ స్టేషన్‌లో 10 పోస్టులు ఖాళీగా వున్నాయి. అలిపిరి స్టేషన్‌లో ఇద్దరు ఏఎస్‌ఐలు, మరో 10 మంది కానిస్టేబుళ్ళ పోస్టులు భర్తీ చేయాల్సి వుంది. పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు 100మంది కానిస్టేబుళ్ళను లేకుంటే హోంగార్డులను అయినా నియమించాల్సి వుంది. మరోవైపు కోర్టు డ్యూటీలు, సమన్లు సర్వ్ చేయడం, బీట్ కానిస్టేబుళ్ళు రక్షక్, బ్లూకోల్ట్స్, మొబైల్ పార్టీలు వున్నా ప్రతి విభాగంలో అవసరమైన సంఖ్యలో కానిస్టేబుళ్ళు లేకపోవడంతో రాత్రీపగలు డ్యూటీలు చేయలేక సిబ్బంది విసిగిపోతున్నారు.

గంజాయి కేంద్రంగా తిరుపతి

తిరుపతి జిల్లాలో రెండేళ్లుగా ఆన్‌లైన్ నేరాలు పెరిగిపోతున్నాయి.గత ఆరు నెలల వ్యవధిలోనే తిరుపతి సైబర్ క్రైం స్టేషన్ పరిధిలో దాదాపు 50 కేసులు నమోదయ్యాయి.ఈ కేసులను విచారించి బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్నారు. కేవలం ఒక సీఐ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఎస్‌ఐలు, కానిస్టేబుళ్ళ పోస్టులు ఖాళీగా వున్నాయి. దీంతో కేసుల విచారణ నత్తనడకన సాగుతోంది. ఇక మొబైల్ ఫోన్ల చోరీలు లెక్కకు మించి జరుగుతున్నా నిందితులను గుర్తించి అరికట్టడానికి అవసరమైన సిబ్బంది లేరు. మరోపక్క చాలాకాలంగా తిరుపతిలో గంజాయి వాడకం బాగా పెరిగింది. ఇక్కడకు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, రంపచోడవరం, పాడేరు ప్రాంతాల నుంచి కూలీలు ఉపాధి కోసం వలస వస్తున్నారు. వీరి ద్వారా కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఇక్కడికి గంజాయి సరఫరా అవుతోంది. యువత, విద్యార్థులు, కూలీలు గంజాయికి అలవాటు పడుతుండడంతో విక్రయాలు బాగా పెరుగుతున్నాయి. సగటున తిరుపతి జిల్లాలో నెలకు 20 కేసులు నమోదు చేస్తున్నారంటే గంజాయి వ్యాప్తి ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. వీటికి తోడు ఇళ్లలో దొంగతనాలు, హైవే దోపిడీలు,ద్విచక్ర వాహనాల చోరీలు కూడా ఎక్కువగానే జరుగుతున్నాయి. వీటన్నింటినీ అరికట్టాలంటే అవసరమైన సంఖ్యలో సిబ్బందిని నియమించాల్సిన అవసరం వుందని పోలీసు అధికారులు సంఘం చెబుతోంది.అయితే పదేళ్లుగా ఈ విషయమై తిరుమలకు వస్తున్న హోం మంత్రులకు, డీజీపీలకు సంఘం వినతి పత్రాలు ఇస్తున్నా స్పందించిన దాఖలాల్లేవు.

రేపటినుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్‌తోపాటు మండల కార్యాలయాల్లోనూ ఇక ప్రతి వారం నిర్వహణ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 22: వైసీపీ ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన పేరుతో ప్రజల నుంచి అర్జీలను తూతూ మంత్రంగా స్వీకరించేది. పరిష్కారానికి మాత్రం నోచుకునేవి కావని జనం ఆవేదన వ్యక్తం చేసేవారు. ఈ క్రమంలో చంద్రబాబు సీఎం కాగానే పక్కా ప్రణాళికతో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడానికి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం)' ప్రవేశపెట్టారు. దీన్ని జిల్లాలో సోమవారం నుంచి అమలు చేయనున్నారు. కలెక్టరేట్ తోపాటు అన్ని డివిజినల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఉదయం 10గంటల నుంచి సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర తెలిపారు. ఎన్నికల ప్రక్రియ కారణంగా అధికారులు బిజీగా ఉండటంతో సోమవారం ఉదయం అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.



చెట్టును ఢీకొన్న కారు - జగన్ మృతదేహం



విశ్రాంతి లేని ప్రయాణానికి

ఇద్దరి బలి

- తిరువణ్ణామలైలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు తిరుపతివాసుల దుర్మరణం
- మరో 8 మందికి తీవ్రగాయాలు



మునెమ్మ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), జూన్ 22: తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైలో శనివారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తిరుపతికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రెడ్డిగుంటకు చెందిన పెయింటర్ కె.గోపాల్, ప్రవల్లిక అలియాస్ మునెమ్మ (27) దంపతులు, వీరరాఘవులు భార్య నిర్మల, కుమార్తె లలిత, సుబ్బారెడ్డి నగర్‌లో కాపురమున్న శ్రీకాకుళానికి చెందిన జగన్ (17), ఆయన కుటుంబీకులు ఆదినారాయణ, రుషినాగ దంపతులు, కావిల్‌నాయుడు, జ్యోతి శుక్రవారం మధ్యాహ్నం కారులో డ్రైవర్ రియాజ్‌తో కలిసి తిరువణ్ణామలైకి బయల్దేరారు. మార్గమధ్యంలో కాణిపాకంలోని వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. తర్వాత గోల్డెన్ టెంపుల్‌కు వెళ్లారు. తర్వాత తిరువణ్ణామలైకి చేరుకున్నారు. పౌర్ణమి సందర్భంగా రాత్రికి డ్రైవర్ రియాజ్‌తో కలసి అందరూ కొండచుట్టు తిరిగి బాగా అలసి పోయారు. విశ్రాంతి తీసుకోకుండా శనివారం తెల్లవారు జామున ఐదు గంటలకు తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తిరువణ్ణామలైకి సమీపంలోని కురుమలై వద్దకు 5.30 గంటలకు చేరుకున్నారు. అలసిపోయి ఉన్న డ్రైవర్ తొలుత ఎదురుగా వచ్చిన బస్సును ఢీకొన్నాడు. దాన్నుంచి తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మునెమ్మ, జగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఎనిమిది మందీ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులను తిరువణ్ణామలై ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తిరుపతిలోని బాధితుల ఇళ్ల వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరూ కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది.

ఆ ఉద్యోగులపై కొరడా

ఎన్నికల విధులకు డుమ్మా కొట్టి వివరణ ఇవ్వనివారిపై ఉన్నతాధికారుల సీరియస్

గతంలో చర్యలు తీసుకోకుండా వైసీపీ పెద్దలు అడ్డుకున్న వైనం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 22: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న జరిగిన పోలింగ్ విధులకు జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 272మంది ఉద్యోగులు గైర్హాజరయ్యారు. వీరందరికీ షోకాజు నోటీసులు జారీ చేశారు. అయితే కొందరు మాత్రం వివరణ ఇవ్వలేదు. ఇలా వివరణ ఇవ్వని వారిపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించనున్నారు. వివరాలిలా ఉన్నాయి. షోకాజ్ నోటీసులు అందుకున్న సగం మంది అనారోగ్య కారణాలు చూపుతూ మెడికల్ సర్టిఫికెట్లతో వివరణ ఇచ్చారు. ఇంకొంతమంది తమకు ఎన్నికల విధులు రెండుచోట్ల కేటాయించారని తెలియజేశారు. మిగిలిన వారు మాత్రం తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందన్న ధీమాతో ఎటువంటి వివరణ ఇవ్వలేదు. దీనికి నిదర్శనంగా వీరిపై చర్యలు తీసుకోవడానికి ఓ జిల్లా ఉన్నతాధికారి ప్రయత్నం చేసినా వైసీపీ పెద్దలు అడ్డుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత దీనికి సంబంధించిన ఫైలు మూలన పడింది. ఇపుడు ప్రభుత్వం మారడంతో ఆ ఫైల్‌లో కదలిక వచ్చింది. గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని బదిలీపై వెళ్లిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వివరణ ఇవ్వని సుమారు 30మందికిపైగా సస్పెన్షన్ వేటుకు గురికానున్నారని తెలుస్తోంది.

ఆ ఏడుగురి మాటేమిటి?

గతంలోనూ ఎన్నికల రెండో దఫా శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన ఏడుగురిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు కలెక్టర్ పేరుతో సమాచార అధికారులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. తీరా పరిశీలిస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. ఇది సమాచార శాఖ లోపమా లేదా ఈ ఏడుగురిపై కూడా వేటు పడకుండా వైసీపీ పెద్దలు కాపాడారా? అనే దానిపై ఈ ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ
ఇద్దరి మృతి



మృతి చెందిన సాయికృష్ణ, ఈశ్వర్

నింద్ర. జూన్ 22: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన నింద్ర మండలంలోని కొప్పేడు వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శ్రీరాంపురం దళితవాడకు చెందిన ఈశ్వర్(47) పుత్తూరు ఆర్టీసీ డిపోలో ప్రైవేటు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. సాయికృష్ణ(24) మరో వ్యక్తితో కలిసి శ్రీరామపురం నుంచి పాలమంగళానికి బైక్‌లో వెళుతున్నాడు. కొప్పేడు సమీపంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాల య్యాయి. గాయపడిన వ్యక్తిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ రామచంద్రయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్‌కుమార్



చిత్తూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ షన్మోహన్ కాకినాడకు బదిలీ అయ్యారు. సుమిత్‌కుమార్ 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు అల్లూరి సీతారామరాజు కలెక్టర్‌గా పనిచేశారు. హర్యానా రాష్ట్రం రోహతక్ జిల్లాకు చెందిన సుమిత్‌కుమార్ ఇంజనీరింగ్ పూర్తయ్యాక నాలుగేళ్ల ఐటీ ప్రొఫెషనల్‌గా ఉద్యోగం చేశారు.

హోంమంత్రికి ఘన స్వాగతం


మంత్రికి స్వాగతం పలుకుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు గాలి పూర్ణానంద చౌదరి

చంద్రగిరి, జూన్ 22: హోంమంత్రి వంగలపూడి అనితకు శనివారం రాత్రి తిరుపతి 44వ డివిజన్‌లోని మున్సిపల్ పార్క్ కూడలిలో టీడీపీ సీనియర్ నాయకుడు గాలి పూర్ణానంద చౌదరి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా ఆమె తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రికి పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్, టీడీపీ బీసీ సాధికార కమిటీ రాష్ట్ర నాయకులు మధుసూదన్‌యాదవ్, గాలి పవన్‌చౌదరి, వినోద్, డివిజన్ నాయకులు కేఎం నాయుడు, పార్వతమ్మ, భారతమ్మ, బాలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



పాకాల, జూన్ 22: దామలచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం తెలుగుదేశం, జనసేన నాయకులు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. నాయకులు అబ్దుల్ ఘనీ, నారా రమేష్ బాబు, పురుషోత్తం, లతీఫ్, లంకిపల్లె కోటేశ్వరనాయుడు, నాసిర్ అహ్మద్, ఉపాధ్యాయులు విజయమోహన్, రెడ్డెప్ప, పత్తిపాటి రమేష్ నాయుడు, చిన్నస్వామి, సుధాకర్, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, ఖాజా యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై గ్రామస్తుల హర్షం



పాకాల, జూన్ 22: కావలివారిపల్లె కొత్తూరులో 120కి పైగా గృహాలున్నాయి. అయినా ఇక్కడ 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఉంది. దీంతో కొన్నేళ్లుగా లో ఓల్టేజీ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పలుసార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల ఏఈ ప్రశాంత్‌కు మరోమారు ఫిర్యాదు చేశారు. ఆయన శనివారం 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దాంతో సర్పంచ్ చెంగల్రాయులు, గ్రామస్తులు కె.సావిత్రి, ప్రభాకర్‌నాయుడు, జగదీష్, సాంబయ్య, మునిరాజ, మురళి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టారంటూ ఫిర్యాదు



చంద్రగిరి, జూన్ 22: తన ద్విచక్ర వాహనంపై పెట్రోలు పోసి నిప్పంటించారంటూ పాత శానంబట్లకు చెందిన టీడీపీ నాయకుడు శంకరయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎప్పటిలాగే ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం రాత్రి తన ఇంటి ముందు పార్క్ చేశాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. గమనించిన ఆయన బయటకు వచ్చి చూసేసరికి అదే గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ నిప్పంటించినట్లు గుర్తించి, పట్టుకునే ప్రయత్నం చేయగా పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు విచారిస్తున్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం


గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, జూన్ 22: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. తర్వాత స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబురాలు, బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించి, స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారథి, జమేదార్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట- శ్రీకాళహస్తి రైల్వే సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), జూన్ 22: రేణిగుంట-శ్రీకాళహస్తి రైల్వే సెక్షన్‌లో శనివారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) వినీత్ సింగ్ తనిఖీలు చేశారు. రేణిగుంట నుంచి తిరుమలకు వెళ్లిన ఆయన శ్రీవారి దర్శనానంతరం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లి ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. అక్కడ జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎల్‌సీ గేట్ 27 వద్ద ఆగి గేట్‌మెన్ పనితీరును, నిర్వహణను గమనించారు. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని యార్డును పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సూచనలిచ్చారు. డివిజన్ స్థాయి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.


రైలు పట్టాలపై తనిఖీలు చేస్తున్న వినీత్ సింగ్

నీట్ స్కామ్‌పై ప్రధాని స్పందించాలి : ఏఐఎస్ఈసీ



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), జూన్ 22: నీట్ స్కామ్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించాలని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) నేతలు డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలిసి ఎంఆర్‌పల్లెలోని దండిమార్చ్ విగ్రహంవద్ద శనివారం నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర సెక్రటేరియట్ మెంబర్ ఎ.హరీష్ మాట్లాడుతూ.. ఎన్‌టీఏ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరైందన్నారు. పౌర చైతన్య వేదిక కార్యదర్శి జి.ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. ఎన్‌టీఏను రద్దుచేసి మెడికల్ ఎంట్రన్స్ పరీక్షల నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు చొరవ తీసుకుని దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. నాయకులు లక్ష్మి, అమీనా, నవీన్, ఉన్నతి, తదితరులు పాల్గొన్నారు.

ఒలంపిక్ డే ర్యాలీ

తిరుపతి(క్రీడలు), జూన్ 22: ఒలంపిక్ డే పురస్కరించుకుని శనివారం నగరంలో క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వై.ప్రవీణ్, ఆర్.శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రీనివాస క్రీడా సముదాయం వద్ద కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్‌రెడ్డి కాగడా ప్రదర్శించగా.. జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. బాలాజీ కాలనీ మీదుగా టౌన్‌క్లబ్ వరకు వచ్చి తిరిగి ఎస్వీ క్యాంపస్‌స్కూల్ మీదుగా శ్రీనివాస క్రీడా సముదాయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయస్థాయిలో ఉత్తమ పాత్రికేయులకు ఏటా రామోజీ స్మారక అవార్డులు

» టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఉత్తమ పాత్రికేయులకు రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు దివంగత రామోజీరావు పేరిట ఏటా స్మారక అవార్డులను ప్రదానం చేయనున్నట్లు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిఖిల కలిశెట్టి విద్య, వైద్య, చారిటబుల్ ట్రస్టు తరపున ఈ అవార్డులను అందజేస్తామన్నారు. త్వరలోనే సీనియర్ పాత్రికేయులతో కమిటీ ఏర్పాటు చేసి, ఆంగ్ల, హిందీ భాషలతో పాటు దేశవ్యాప్తంగా ప్రాంతీయ భాషల్లో పనిచేస్తున్న ఉత్తమ పాత్రికేయులను గుర్తించి అవార్డులను అందజేస్తామని తెలిపారు. ఒక్కో ఏడాది ఒక్కో రాష్ట్రంలో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. రామోజీ స్మారక అవార్డుకు ఎంపికైన వారికి రూ.20 వేల నగదుతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందజేస్తామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా బీజేపీ నేత సిరిపురపు తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌లో సాంకేతిక లోపం...

» వందేభారత్ రైలు 4 గంటలు ఆలస్యం

విశాఖపట్నం,జూన్ 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (208 33) శనివారం నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరింది.ఈ రైలు రోజూ ఉదయం 5.45గంటలకు ఇక్కడినుంచి బయలుదేరాలి. అయితే ప్లాట్‌ఫారం పైకి తీసుకువచ్చాక సీ-9 కోచ్‌లో సాంకేతిక లోపం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దానిని సరిచేసి పంపించేసరికి ఉదయం పది గంటలైంది. ఇటీవల కాలంలో వందే భారత్ రైలులో తరచూ సమస్యలు వస్తుండడం గమనార్హం.


మంత్రి నాదెండ్ల మనోహర్‌ని తెనాలిలోని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కార్యదర్శి కల్ప రవి - ఎర్రావారిపాలెం

వీలునామా ప్రకారమే నడుచుకుంటున్నాం

పంగులూరు సీతమ్మగారి ఆర్యవైశ్య ధర్మసత్రం అధ్యక్షుడు

తిరుపతి(వైద్యం), జూన్ 22: వీలునామా ప్రకారమే నడుచుకుంటున్నామని పంగులూరు సీతమ్మగారి ఆర్యవైశ్య ధర్మసత్రం అధ్యక్షుడు పామిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. కొత్తవీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఎంఆర్‌పల్లెలోని పంగులూరు సీతమ్మ భూములను లీజుకిచ్చి.. దాని నుంచి వచ్చే ఆదాయంతోనే కన్యకా పరమేశ్వరి ఆలయం, ఆర్యవైశ్య సత్రం నిర్వహణ చేపడుతున్నామన్నారు. సీతమ్మ రాసిన వీలునామాలో కూడా ఇదే ఉందని చెప్పారు. సీతమ్మ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనడంలో వాస్తవం లేదన్నారు. అవకతవకలు ఉన్నట్లు ఎవరైనా గుర్తిస్తే తాము చర్చా గోష్ఠికి ఎప్పుడూ సిద్ధమేనన్నారు. కమిటీ సభ్యులు మహేష్, శిరీష, రవి, చంద్రశేఖర్, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

29లోపు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి : జేసీఐ


మాట్లాడుతున్న జేసీఐ ప్రతినిధులు

తిరుపతి(వైద్యం), జూన్ 22: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వారు ఏటా పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లకు ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మాజీ ప్రెసిడెంట్ మునిశేఖర్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 చదివే విద్యార్థులు ఈ స్కాలర్ షిప్‌లకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 95509 76027, 79979 91101 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబు కుప్పం పర్యటన ఇలా..

కుప్పం, జూన్ 22: సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన షెడ్యూల్ దాదాపు ఖరారైంది. 25వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు పీఈఎస్ వైద్య కళాశాల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్‌షోగా బయలుదేరి కుప్పంలో అన్న క్యాంటీన్‌ను మధ్యాహ్నం 1.00-1.30 గంటల మధ్య ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి ఆర్టీసీ బస్టాండు సర్కిల్ చేరుకుని టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు, అంబేడ్కర్ విగ్రహాలకు అంజలి ఘటిస్తారు. అక్కడే మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 గంటల దాకా బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం పీఈఎస్ ఆడిటోరియం చేరుకుని మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల దాకా అధికారులతో సమీక్ష జరుపుతారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో టీడీపీ నియోజకవర్గ, సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమవుతారు. రాత్రి అక్కడే బస చేస్తారు. 26వ తేదీ ఉదయం 10నుంచి 11 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు శాంతిపురం జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి వద్ద హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువను సందర్శిస్తారు. తిరిగి పీఈఎస్ ఆడిటోరియం చేరుకుని మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారు. 4.30 గంటలకు కుప్పం నుంచి హెలికాప్టర్‌లో అమరావతి బయలుదేరి వెళ్తారు.

హోం మంత్రి కాన్వాయ్ ఢీకొని బీజేపీ నేతకు గాయాలు

తిరుపతి (నేరవిభాగం), జూన్ 22 : తిరుమలకు వెళుతున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కాన్వాయ్ ఢీకొని ఓ బీజేపీ నాయకుడు గాయాలపాలయ్యాడు. అలిపిరిలోని గరుడ విగ్రహం వద్దకు మంత్రి కాన్వాయ్ రాగానే తిరుపతి ఉత్తర మండల బీజేపీ నాయకుడు ప్రభాకర నాయుడు ఆమెకు శాలువా కప్పడానికి వెళ్లాడు. ఆ సమయంలో వెనుక నుంచి వస్తున్న కాన్వాయ్ వాహనం ఆయన్ను ఢీకొంది. ఈ ఘటనలో అతని ఎడమ కాలికి గాయమవడంతో చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.


గాయపడిన ప్రభాకర నాయుడు

ప్రకృతి వ్యవసాయంపై నారావారిపల్లెలో పరిశీలన


ఇంటి వద్ద పండిస్తున్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి, జూన్ 22: ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయడంలో భాగంగా శనివారం నారావారిపల్లెలో ఏపీ ఎస్ఎఫ్ రీజనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈసందర్భంగా నారావారిపల్లెలో రైతులు, మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. ఈకార్యక్రమంలో డీపీఎం షణ్ముగం, సీనియర్ కన్సల్టెంట్ రేవంత్‌రెడ్డి, చిత్తూరు డీపీఎం వాసు, మాస్టర్ ట్రైనీ శ్రీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకెద్దులు కథాసంకలనం ఆవిష్కరణ నేడు



తిరుపతి (కల్చరల్), జూన్ 22: తిరుపతికి చెందిన పేరూరు బాలసుబ్రహ్మణ్యం రచించిన మడకెద్దులు కథాసంకలనం ఆవిష్కరణ సభ ఆదివారం ఉదయం 9.45 గంటలకు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయంలోని సమావేశ మందిరంలో జరుగుతుంది. తెలుగు భాషోద్యమ సమితి నిర్వహించే ఈ సభలో భూమన్, మధురాంతకం నరేంద్ర, పుట్టా పెంచలదాసు, సాకం నాగరాజు, తదితరులు పాల్గొంటారు.

'ఆఖరి స్నేహితుడు' పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్), జూన్ 22: రచయిత సమాజం నుంచి వస్తువును తీసుకుని కథలుగా మలుస్తారని ఎస్వీయూ ఓఆర్ఐ సంచాలకుడు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు అన్నారు. తిరుపతికి చెందిన ప్రముఖ కథా రచయిత తిరువాయిపాటి రాజగోపాల్ రచించిన కథల సంపుటి ఆఖరి స్నేహితుడు పుస్తకావిష్కరణ సభ శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగింది. పుస్తక సమీక్ష చేసిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రచయిత వ్యక్తిత్వం ఈ కథల్లో ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రముఖ నవలా రచయిత మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ.. రచయిత సున్నిత హృదయం ఈ కథల్లో కనిపిస్తోందన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం (తిరసం) కార్యదర్శి డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సభలో ఆత్మీయ అతిథులుగా ఆచార్య పి.దేవసేన నాయుడు, ఆచార్య ఎ.గురుమూర్తిలు ఎంఏలో తమ క్లాస్ మేట్ అయిన రచయితతో ఉన్న అనుబంధాన్ని సభకు తెలియజేశారు. తిరసం అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజు, టెంకాయల దామోదరం, జయరామ్ ప్రసాద్, ఆకుల మల్లేశ్వరరావు, సుభద్ర, వి.కాంతారావు, కొత్వాలు అమరేంద్ర, తమటం రామచంద్రారెడ్డి, నాదెళ్ల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

వృత్తిపరమైన శ్రద్ధ అవసరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 22: పారిశ్రామిక రంగంలో యువత రాణించేందుకు వృత్తిపరమైన శ్రద్ధ అవసరమని కెరీర్ గైడెన్స్ నిపుణుడు చెంగముని అన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆహార ఉత్పత్తి, భద్రత, నాణ్యత, ఐఎస్‌వో గుర్తింపు, మార్కెటింగ్, ప్రభుత్వ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బిల్డర్ మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 22: దాడిలో గాయపడి రామచంద్రానగర్‌కి చెందిన బిల్డర్ వెంకటశివారెడ్డి (64) కొద్దిరోజులుగా స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో నిందితులపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. రామచంద్రానగర్‌లోని గిరీషాకుమార్ రెడ్డి వ్యాపారం నిమిత్తం తెలిసిన వారి వద్ద భారీ మొత్తంలో అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చినవారు తరచూ ఆయన ఇంటి వద్దకు వచ్చి గొడవలు చేసేవారు. ఇతడి ఎదురింట్లో ఉంటున్న బిల్డర్ వెంకటశివా రెడ్డి ఈ గొడవలేంటని గిరీషాకుమార్‌రెడ్డిని మందలించాడు. దీంతో వెంకటశివారెడ్డిని హతమార్చాలని భావించి.. సుపారీపై హంతకులను రప్పించి మారణాయుధాలతో దాడి చేయించారు. ఈ ఘటనలో బిల్డర్ తలపై బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తొలుత అమరా ఆస్పత్రికి, తర్వాత స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిందితులపై గతంలో నమోదు చేసిన హత్యాయత్నం కేసును హత్య కేసుగా నమోదు చేయనున్నట్లు అలిపిరి సీఐ రామారావు చెప్పారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



తిరుపతి(విద్య), జూన్ 22: పట్నూలువీధి నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. అర్బన్ ఎంఈవో కె.బాలాజితో కలిసి హెచ్ఎం భీమినేని మునికృష్ణనాయుడు వీటిని విద్యార్థులకు అందజేశారు. టీచర్లు జయంతి, హేమమాధురి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎపిక్ కార్డుల విచారణ వేగవంతం చేస్తాం

హోం మంత్రి అనిత


విమానాశ్రయంలో మంత్రికి స్వాగతం పలుకుతున్న సుగుణమ్మ తదితరులు

తిరుపతి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంగా 35వేల ఎపిక్ కార్డులు అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో విచారణ వేగవంతం చేస్తామని, దోషులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టమని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.శ్రీవారి దర్శనం కోసం శనివారం రాత్రి తిరుమలకు వెళ్లిన ఆమెకు విమానాశ్రయం వద్ద, తిరుపతిలోని కపిలతీర్థం వద్ద వున్న టీడీపీ కార్యాలయం దగ్గర టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. అంగళ్లు ఘటనతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెట్టిన తప్పుడు కేసులపై పునర్విచారణ చేయిస్తామన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసుల్ని తొలగిస్తామన్నారు.అనితకు స్వాగతం పలికినవారిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నాయకులు దంపూరు భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, శ్రీహరి నాయుడు, రుద్రకోటి సదాశివం, మునిశేఖర్ రాయల్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో హోంమంత్రి అనిత

తిరుమల, జూన్22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుమలకు వచ్చారు. రాత్రి 8.10 గంటలకు తిరుమలలో గాయత్రి నిలయం అతిథిగృహానికి చేరుకున్న ఆమెకు టీటీడీ రిసెప్షన్ అధికారులు సత్రేనాయక్, భాస్కర్, సీవీఎస్వో నరసింహకిషోర్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు.తిరుమల టీడీపీ కార్యకర్తలు కూడా మంత్రికి స్వాగతం పలికారు. కాగా, మంత్రి అనిత ఆదివారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

సభా మర్యాద తెలియని వ్యక్తి జగన్

తెలుగు యువత


మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(వైద్యం), జూన్ 22: 'రాష్ట్ర పాలన ఎలాగూ చేతకాలేదు. కనీసం సభా మర్యాద కూడా తెలియని దౌర్భాగ్య స్థితిలో జగన్ ఉన్నాడు. ఇలాంటి వ్యక్తి ఐదేళ్ల సీఎంగా పనిచేయడం సిగ్గు చేటు' అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో మాజీ సీఎం స్థాయిని మరిచి జగన్ ప్రవర్తించడం బాధాకరమన్నారు. ఆయనకు సీఎంగా జనం అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా.. కేవలం కక్ష సాధింపులు, దోపిడీలు, దౌర్జన్యాలతో పాలన సాగించాడని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేయించిన జగన్ ఈరోజు అనధికారికంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాన్ని కూలిస్తే దాన్ని కక్ష సాధింపు చర్య అని.. దేశమంతా స్పందించాలనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడే నీచమైన పనులు చేయదని.. చట్టం తన పని తాను చేస్తుందన్నారు. టీడీపీ నేతలు రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగానే మిగిలిపోతాడు: బీజేపీ

మాజీ సీఎం జగన్‌కు భవిష్యత్తులో కనీసం ఒక్క సీటు కూడా రాకుండా ఒంటరిగానే మిగిలిపోతాడని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి జోస్యం చెప్పారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అక్రమ కట్టడం కూల్చివేతపై జగన్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. నవ్యాంధ్రను ఐదేళ్లలో అరాచక, అంధకార, అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఆయనకు కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. పరదాల మాటున ఐదేళ్ల గడిపేసి.. ప్రమాణ స్వీకారానికి కూడా అసెంబ్లీకి వెనుక మార్గం నుంచి వచ్చాడంటే అంతకన్నా దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. ఇకపై జగన్ ట్వీట్లకే పరిమితమని, అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. అనంతరం జగన్ అక్రమాలపై రూపొందించిన వాల్ పోస్టర్లను చూపారు. బీజేపీ నేతలు వరప్రసాద్, భాస్కర్, శేఖర్, జయరామ్, హరి తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లను చూపుతున్న భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

టీటీడీ విద్యాసంస్థల్లో స్థానికులకు 50 శాతం సీట్లు కేటాయించాలి

● విద్యార్థి సంఘాల డిమాండ్


మీడియాతో విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి(వైద్యం), జూన్ 22: టీటీడీ విద్యాసంస్థల్లో స్థానిక విద్యార్థులకు 50శాతం సీట్లు కేటాయించాలని భారతీయ దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు కొండా యుగంధర్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నేతలతో కలిసి శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఇక నిరుపేద విద్యార్థులు కేవలం ప్రభుత్వ బడుల్లో చదువుతారని.. అలాంటి వారికి కార్పొరేట్ పాఠశాలల్లో చదివేవారితో సమానంగా మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తుండటంతో పేద విద్యార్థులంతా ఉన్నత చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ విషయాలపై ఇప్పటికే పలుమార్లు టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. పైగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీటీడీ విద్యాశాఖాధికారికి తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా తగిన చర్యలు తీసుకోకుంటే విద్యార్థి సంఘాలన్నీ ఏకమై టీటీడీ పరిపాలన భవనాన్ని ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నేతలు హేమాద్రి యాదవ్, సుధాకర్ మాదిగ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంగీత యజ్ఞం



తిరుపతి (కల్చరల్), జూన్ 22: పాస్ మనోవికాస్ సేవా సంస్థ, టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంగీత సప్తాహం పేరుతో నిర్వహిస్తున్న సంగీతయజ్ఞం కొనసాగుతోంది. శుక్రవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం ఏడు గంటల నుంచి పలువురు గాత్ర విద్వాంసులు అన్నమాచార్యుల భక్తిభావ స్వర తరంగాలు పేరుతో సంకీర్తనలు గానంచేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే మహామంగళహారతితో సంగీత సప్తాహం ముగుస్తుందని నిర్వాహకుడు షణ్ముఖరాజు మురళీకృష్ణ తెలిపారు.

తిరువణ్ణామలైకి మరో 20 ఆర్టీసీ బస్సులు

ప్రతిపాదనలు పంపామన్న డీపీటీవో చెంగల్‌రెడ్డి



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 22: తిరువణ్ణామలైకి మరో 20 రెగ్యులర్ ఆర్టీసీ బస్సుల కోసం ప్రతిపాదనలు పంపామని ప్రజారవాణాధికారి (డీపీటీవో) తిమ్మాడి చెంగల్‌రెడ్డి వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పౌర్ణమి పర్వదినాన తిరువణ్ణామలైకి జిల్లానుంచి భక్తులు అధిక సంఖ్యలో వెళుతుండటంతో 2022 నవంబరు నుంచి ప్రత్యేక సర్వీసులు నడపడం ప్రారంభించామన్నారు. ప్రస్తుతం 120నుంచి 150 బస్సులు నడుపుతున్నామని చెప్పారు. రాను, పోను టికెట్ రిజర్వేషన్ చేసుకుంటే 10శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే తిరువణ్ణామలైకి వివిధ జిల్లాల డిపోల నుంచి వెళ్లే బస్సుల ద్వారా లభించే రాబడిలో తిరుపతి జిల్లా నుంచి 37శాతం నమోదవడం విశేషమన్నారు. దీనిపై రెండ్రోజుల కిందట ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు నుంచి అవార్డును కూడా అందుకున్నామన్నారు. చక్కటి సమన్వయంతో అధికారులు, సిబ్బంది పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5కోట్ల రాబడిగా లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు. తొలిసారిగా మేనెలలో ఈపీకే రూ.54.50 లక్ష్యం కాగా, రూ.54.72 సాధించి.. అధిగమించడం విశేషమన్నారు.

గతంలో రాబడి ఇలా..

- 2022 నవంబరు నుంచి 2023మార్చి వరకు 22 బస్సులు 10,196కిలోమీటర్లు తిరగ్గా.. ఈపీకే రూ.58, ఆక్యుపెన్సీ రేషియో 93శాతం, రాబడి రూ.5.9లక్షలు.
- 2023-24ఆర్థిక సంవత్సరంలో 1,445బస్సులు, 6,62,729 కిలోమీటర్లు తిరగ్గా.. ఈపీకే రూ.52, ఆక్యుపెన్సీ రేషియో 88శాతం, రాబడి రూ.3.68కోట్లు.

తూతూ మంత్రంగా హోటళ్లపై పర్యవేక్షణ : బీజేపీ

తిరుపతి (జీవకోన), జూన్ 22: తిరుపతిలోని హోటళ్లపై పర్యవేక్షణ తూతూ మంత్రంగా ఉందని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. లీలామహల్ వద్ద ఉన్న పీఎస్4లో రెండ్రోజుల కిందట ఓ భక్తుడి ఆహారంలో జెర్రి రావడంతో ఆరోగ్యశాఖ అధికారులు మేల్కొని ఆ హోటల్‌ను సీజ్ చేశారన్నారు. నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారులు నెలలో రెండుసార్లు అయినా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీ చేసిన దాఖలాలు లేవన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కొన్ని హోటళ్లవారు జాగ్రత్తలకు మంగళం పాడేశారన్నారు. ఇకనైనా తరచూ తనిఖీలు జరిగేలా జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండండి

ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర


అధికారులకు సూచనలిస్తున్న ధ్యానచంద్ర

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 22: అతిసార నియంత్రణపై దృష్టి పెట్టాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం వర్చువల్ విధానంలో మండల స్థాయి అధికారులతో పలు సమస్యలపై సమీక్షించారు. గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీవరకు అతిసార నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలస్థాయిలో టాస్క్‌ఫోర్సు కమిటీ ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని చెప్పారు. డీఆర్వో పెంచలకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 72,294 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,855 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


మోషేన్‌రాజు

తిరుమల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. ఫారెస్ట్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ లీనా నందన్, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, తెలంగాణ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఐఏఎస్ అధికారి వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.


కాలినడకమార్గంలో యువతి అదృశ్యం


విద్య (ఫైల్ ఫొటో)

తిరుమల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలో ఓ యువతి కనిపించకుండా పోయినట్టు తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన హరిబాబు 15 ఏళ్లుగా కుటుంబీకులతో కలిసి అలిపిరి కాలినడకమార్గంలోని గాలిగోపురం వద్ద టిఫిన్ అంగడి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో హరిబాబు కుమార్తె విద్య (20) బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆమెకోసం తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఆచూకీ తెలిసిన వారు 0877 2263733 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

చేతివృత్తులతో ఆర్థికాభివృద్ధి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 22: మహిళలు సమయాన్ని వృథా చేయకుండా చేతివృత్తుల్లో శిక్షణ పొంది కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయొచ్చని రాస్ కో-ఆర్డినేటర్ నాగేశ్వర రావు అన్నారు. కొర్లగుంటలోని రాస్ జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో వంద రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రామాంజనేయులు, సీతామహాలక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.





గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

'క్వార్ట్జ్' అక్రమాలపై సీబీఐతో విచారణ

- ఉమ్మడి జిల్లా అభివృద్ధే ధ్యేయంగా నడుద్దాం
- వీపీఆర్ నివాసంలో మంత్రులు, ఎమ్మెల్యేల తీర్మానం



వేమిరెడ్డి దంపతులతో భేటీ అయిన మంత్రులు, ఎమ్మెల్యేలు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 22: జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు తీర్మానించారు. అలాగే, ఉమ్మడి జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేద్దామని నిర్ణయించుకున్నారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు శనివారం తాడేపల్లిలోని తమ నివాసంలో భేటీ అయ్యారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరావు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలనే అంశాలపైనా వారు చర్చించారు.

దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం చేపట్టాలి



నిరసన కార్యక్రమంలో చింతామోహన్ తదితరులు

గూడూరు/సూళ్లూరుపేట/వెంకటగిరిటౌన్, జూన్ 22: దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు ఒత్తిడి తీసుకురావాలని మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మోదీ ప్రధాని అయ్యాక అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని బీజేపీ రద్దు చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు చందన మూడి శివ, రాజేంద్ర, నాగూరయ్య పాల్గొన్నారు. అలాగే వెంకటగిరి తెలుగు గంగ అతిథి గృహం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మన్నవరం భెల్ ఫ్యాక్టరీకి వేసిన పునాది రాయి నేడు అనాథ రాయిగా మిగిలిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి భెల్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కృషి చేయాలని కోరారు.

యువతకు టీడీపీలో పెద్దపీట: నెలవల



టీడీపీ యువ నేత పృథ్వీ జన్మదిన వేడుకల్లో మాజీ ఎంపీ నెలవల

నాయుడుపేట టౌన్, జూన్ 22: తెలుగుదేశంపార్టీలో యువతకు పెద్దపీట వేస్తున్నట్లు మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి పార్టీ యువ నేత హంసా పృథ్వీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నెలవల సుబ్రహ్మణ్యం, అమృతసరళ దంపతులను టీడీపీ నాయకులు సన్మానించారు. అనంతరం పృథ్వీ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. టీడీపీ నాయకులు పనల చెంగయ్య, గాలి రాజేష్ నాయుడు, సూరి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల రాజీనామా

గూడూరు అర్బన్, జూన్ 22: స్థానిక ధర్మరాజులస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు శనివారం రాజీనామా చేసినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బీ.శ్రీనివాసులుతోపాటు సభ్యులు రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం



వెంకటగిరిటౌన్, జూన్ 22: స్థానిక బొప్పాపురంలో రాధాకృష్ణ మందిరంలో స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా శనివారం ఏపీపీ ప్రకృతి కుమార్ అన్నదానం నిర్వహించారు. యువసైన్యం సభ్యులు గోపీనాథ్, పోతులూరు, భద్రం, శివకుమార్, మురళి, నాగభూషణం, ప్రహ్లాద్, ప్రవీణ్‌కుమార్, మునెయ్య, భాస్కర్, రాంప్రసాద్, చెంచయ్య, రవికుమార్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా నిమ్మధరలు

గూడూరు అర్బన్, జూన్ 22: దేశీయంగా ప్రసిద్ధి చెందిన గూడూరు నిమ్మమార్కెట్‌లో నిమ్మధరలు నెలరోజులుగా నిలకడగా కొనసాగుతున్నాయి. శనివారం నిమ్మధరలు కేజీ నాణ్యతను బట్టి కనిష్ఠంగా రూ.50 నుంచి గరిష్ఠంగా రూ.80 పలికింది. గతేడాది జూన్ మాసంలో గరిష్ఠ ధర రూ.40 ఉండగా, ప్రస్తుతం రెట్టింపు ధర పలకడం విశేషం. ఈ ఏడాదిలో నిమ్మధరలు గరిష్ఠంగా కేజీ రూ.130 వరకు పలికాయి. ఉత్తర భారతదేశంలో పలు ప్రాంతాలలో వర్షాలు విస్తారంగా కురిసి వేసవితాపం తగ్గుముఖం పట్టినప్పటికీ నిమ్మధరలు స్థిరంగా ఉండటంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తైవాన్ రకం నిమ్మ ధరలకు కుడా రూ.30 నుంచి రూ.50 వరకు ధర పలికింది.

కాలువలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ఏసురత్నం

చిట్టమూరు, జూన్ 22: మండల పరిధిలోని గునపాటిపాళెం మలుపు వద్ద మూడు రోజుల క్రితం మోటరు సైకిల్ ప్రమాదవశాత్తు కాలువలో పడి టి.ఏసురత్నం (36)మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు గునపాడు గిరిజన కాలనీకి చెందిన ఏసురత్నం గురువారం రాత్రి నాయుడుపేట నుంచి మోటరు సైకిల్‌పై గునపాడుకు వస్తుండగా ప్రమాదం జరిగి కాలువలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఏసురత్నంను ఎవరూ గుర్తించకపోవడంతో మృతి చెందినట్లు తెలిపారు. శనివారం కాలువ సమీపంలో దుర్వాసన రావడంతో స్థానికులు చూడగా వ్యక్తి చనిపోయినట్లు గుర్తించి ఎస్‌ఐ చిన్నబలరామయ్యకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. ఏసురత్నం తీవ్రంగా గాయపడి నీళ్లల్లో పడిపోవడం వలన ఊపిరాడక మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌గా రజనీకుమారి

కోట, జూన్ 22: కోటలోని యానాదుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా శనివారం రజనీకుమారి బాధ్యతలు చేపట్టారు. ఓజిలి గురుకులం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రజనీకుమారిని కోటకు బదిలీ చేయగా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శుభకర్‌రావు ఆమెకు బాధ్యతలను అప్పగించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధి బాబు, స్థానికులు

చిల్లకూరు, జూన్ 22: మండల కేంద్రమైన చిల్లకూరు దళితవాడకు చెందిన ఆనందయ్య కుటుంబానికి శనివారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయంగా రూ. 10వేలు అందజేశారు. ఆనందయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో వారికి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలు అందించినట్లు ట్రస్ట్ ప్రతినిధి తెలిపారు. ఈ నగదును ట్రస్ట్ ప్రతినిధి బాబు చేతుల మీదుగా ఆనందయ్య భార్య లక్ష్మమ్మకు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు రాధయ్య, సుబ్బయ్య, ఆర్ముగం తదితరులు ఉన్నారు.

చిన్నారులకు టీకాలు

కోట, జూన్ 22: కోట పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు టీకాలు వేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి, ఎఎన్‌ఎంలు బుజ్జమ్మ, వనజలు ఆయా టీకాలను అందజేశారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



గూడూరు, జూన్ 22: స్థానిక రాజావీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవార్లను, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని గజవాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు.

డంపింగ్‌యార్డ్ ప్రమాదం బీమా సొమ్ము కోసమేనా?



కాలిపోయిన వ్యర్థాలపై మట్టితో కప్పేస్తున్న దృశ్యం

తడ, జూన్ 22: అనధికారికంగా నిర్వహిస్తున్న పరిశ్రమల వ్యర్థాల డంపింగ్‌యార్డు అగ్ని ప్రమాదం బీమా సొమ్ముల కోసమేనా... అంటే అవుననే సమాధానం వస్తోంది. జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఇది సొమ్ముల కోసమే చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాంబట్టు సెజ్‌లోని ఏపీఐఐసీ భూముల్లో అనధికారిక డంపింగ్ యార్డులో ఈనెల 10న భారీ అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. సుమారు మూడు రోజులపాటు మంటలు అదుపులోకి రాలేదు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్ పేరుతో భూములను పొందిన సదరు సంస్థ పరిశ్రమల వ్యర్థాల డంపింగ్ చేస్తుంటే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వ్యర్థాలను రోజుకు కొంత కాలుస్తున్న క్రమంలో భారీ అగ్నిప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. డంపింగ్‌యార్డులో జరిగిన ప్రమాదాన్ని సదరు వ్యక్తి రూ.25లక్షల బీమా రూపేణ రాబట్టుకునే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై తమకు అనుకూలంగా కేసు నమోదు చేయాలని ఓ రాజకీయ నాయకుడి ద్వారా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అనధికారికంగా నడుపుతున్న ఈ డంపింగ్ యార్డులో జరిగిన ప్రమాదానికి సదరు వ్యక్తికి ఏపీఐఐసీ అధికారులు కానీ, పొల్యూషన్ బోర్డు, పంచాయతీ అధికారుల ఇప్పటివరకు నోటీసులు జారీ చేయకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా అగ్నిప్రమాద వ్యర్థాలను సదరు వ్యక్తి అదే స్థలంలో గుంతలు తీసి పూడ్చివేస్తున్నారు. గమనించిన కాదలూరు గ్రామస్తులు శనివారం పూడ్చివేతను అడ్డుకున్నారు. ఈ ప్రమాదంపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయరత్నం ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ... భూములను లీజుకు తీసుకున్న వ్యక్తికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. ఆ నోటీసులకు వివరణ వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అగ్ని ప్రమాద బీమాపై కూడా విచారణ జరుపుతామన్నారు.

బీసీ గురుకులాల్లో అదనపు సీట్లు కేటాయించండి: ఎమ్మెల్యే పాశం



అనంతరాముతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, జూన్ 22: నియోజకవర్గ పరిధిలో బీసీ గురుకులాల్లో విద్యార్థుల కోసం అదనపు సీట్లను కేటాయించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం అమరావతిలో బీసీ సంక్షేమ శాఖ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరామును కలిసి ఈ విషయమై ఆయన విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో వెనుబడిన తరగతులకు సంబంధించిన విద్యార్థులు అధికంగా ఉన్నారన్నారు. దీంతో బీసీ గురుకులాల్లో అదనపు సీట్లు కానీ, అదనపు సెక్షన్‌లను మంజూరు చేయించి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో నాల్గవ వార్షికోత్సవ శిక్షణా శిబిరం



అవగాహన కల్పిస్తున్న కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే

కోట, జూన్ 22: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 4వ విడత వార్షిక శిక్షణా శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 10 ఆంధ్రా నేషనల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థులకు ఈ శిక్షణ జరిగింది. విద్యార్థులకు డ్రిల్, వ్యక్తిత్వవికాసం, గన్ ఫైరింగ్, రెగ్గింగ్, ప్రకృతి వైపరీత్యాలు నివారణ చర్యలు, సామాజిక అవగాహన తదితర అంశాలపై అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్లు శిక్షణ ఇచ్చారు. పలు జిల్లాల నుంచి 645 మంది ఎన్‌సిసి క్యాడెట్‌లు హాజరయ్యారు. పీడీ మల్లికార్జున్‌రెడ్డి, నరేంద్రబాబు, నాగరాజు, పెంచలయ్య, మస్తానయ్య తదితరులు ఉన్నారు.

బీసీ గురుకులానికి రుణపడి ఉంటాం

కోట, జూన్ 22: కోటలోని బీసీ గురుకులానికి రుణపడి ఉంటామని పూర్వపు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం 2003-2004 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ కొరాడ నారాయణరావును పూర్వపు విద్యార్థులు సన్మానించారు. ఈ గురుకులం రాష్ట్రస్థాయిలో టెన్త్, ఇంటర్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించి మొదటిస్థానంలో ఉండటంతో, అక్కడ ఉపాధ్యాయులు, నారాయణరావులను పూర్వ విద్యార్థులు షీల్డ్‌లు, మెమెంటోలతో సత్కరించారు.

నిరుపేదలకు ఆహార పొట్లాల అందజేత

నాయుడుపేట, జూన్ 22: నాయుడుపేట రైల్వేస్టేషన్, బస్టాండ్ ముఖ్యకూడలి ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు శనివారం తడ కండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ సభ్యుడు నెల్లూరు నాగరాజు ఆహారపొట్లాలను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు గుమ్మిడిపూడి బాబురెడ్డి, నదియ దంపతుల సహకారంతో నిరుపేదలకు ఆహారపొట్లాలు, వాటర్‌బాటిళ్లు అందజేసినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

పెళ్లకూరు, జూన్ 22: ప్రజా సమస్యలు, ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి 24 గంటల లోపు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ కేవీఆర్వీ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శనివారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం, అంటు వ్యాధులపై ఇంచార్జీ కలెక్టర్ ధ్యానచంద్ర మండల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

రేణిగుంట- శ్రీకాళహస్తి రైల్వే సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు



రైలు పట్టాలపై తనిఖీలు చేస్తున్న వినీత్ సింగ్

తిరుపతి(సెంట్రల్), జూన్ 22: రేణిగుంట-శ్రీకాళహస్తి రైల్వే సెక్షన్‌లో శనివారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) వినీత్ సింగ్ తనిఖీలు చేశారు. రేణిగుంట నుంచి తిరుమలకు వెళ్లిన ఆయన శ్రీవారి దర్శనానంతరం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లి ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. అక్కడ జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎల్‌సీ గేట్ 27 వద్ద ఆగి గేట్‌మెన్ పనితీరును, నిర్వహణను గమనించారు. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని యార్డును పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సూచనలిచ్చారు. డివిజన్ స్థాయి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరి మృతి

దక్కిలి, జూన్ 22: దక్కిలి మండలం పలుగోడు గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలాయపల్లి మండలం పాపబాంబపురం గ్రామానికి చెందిన మన్నూరు పోతయ్య(32), వీరబాబు(40)లు చికిత్సపొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... బాలాయపల్లి మండలం పాపమాంబపురం గ్రామానికి చెందిన పోతయ్య, వీరబాబు, సునీల్‌లు రాపూరులో పనుల నిమిత్తం వెళ్లి మోటర్‌సైకిల్‌లో తిరిగి ఇంటికి వస్తుండగా శుక్రవారం రాత్రి పలుగోడు గ్రామం వద్ద వెంకటగిరి నుంచి ఎదురుగా వస్తున్న చేపల లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోటర్ సైకిల్‌పై వున్న ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. చికిత్స పొందుతున్న వీరిలో ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సునీల్ పరిస్థితి మెరుగ్గావున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇద్దరు బాల కార్మికులకు విముక్తి

కోట, జూన్ 22: మండల పరిధిలోని కోట పట్టణం, విద్యానగర్ ప్రాంతాలలో శనివారం లేబర్ అధికారులు పలు దుకాణాలలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సురేష్‌బాబు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు అనిల్, సత్యనారాయణల ఆధ్వర్యంలో కోట పట్టణంలోని రెండు దుకాణాలలో పనిచేస్తున్న ఇద్దరు బాల కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. ఆయా దుకాణదారులకు నోటీసులు జారీచేశారు. బాలకార్మికుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యాసామగ్రి అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, జూన్ 22: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వాసవీక్లబ్ సభ్యులు అన్నారు. శనివారం వేములపాళెం ప్రాథమిక పాఠశాలలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, శివప్రసాద్, లలిత, సునీత పాల్గొన్నారు.

శ్రేష్ఠలో పేట విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నాయుడుపేట టౌన్, జూన్ 22: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని షైనీయాక్సీబా శ్రేష్ఠ నెట్స్ 2024 జాతీయస్థాయిలో 228 ర్యాంక్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం పాఠశాల ప్రాంగణంలో షైనీ యాక్సీబాను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు జ్ఞాన ప్రసూనాంబ, రవిశేఖర్, మధు, వరకుమార్, మంజుల, సుధారాణి, కవిత, వజన తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

గూడూరు అర్బన్, జూన్ 22: మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని రోటరీవెస్ట్ క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం చెన్నూరు గిరిజనకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాశిన నాగులు, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, వెంకటరత్నం, ఇందిరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

తడ, జూన్ 22: చిన్నమాంబట్టులో వెలసి ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి అన్నపూర్ణాదేవి ఆలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం వ్యవస్థాపకులు తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామివార్లకు కుంకుమార్చన, పాలాభిషేకం, గోపూజలు జరిగాయి.

పేదలకు అన్నదానం

వెంకటగిరిటౌన్, జూన్ 22: స్థానిక బొప్పాపురంలో రాధాకృష్ణ మందిరంలో స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా శనివారం ఏపీపీ ప్రకృతి కుమార్ అన్నదానం నిర్వహించారు. యువసైన్యం సభ్యులు గోపీనాథ్, పోతులూరు, భద్రం, శివకుమార్, మురళి, నాగభూషణం, ప్రహ్లాద్, ప్రవీణ్‌కుమార్, మునెయ్య, భాస్కర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో ఉత్తమ పాత్రికేయులకు ఏటా రామోజీ స్మారక అవార్డులు

- టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఉత్తమ పాత్రికేయులకు రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు దివంగత రామోజీరావు పేరిట ఏటా స్మారక అవార్డులను ప్రదానం చేయనున్నట్లు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిఖిల కలిశెట్టి విద్య, వైద్య, చారిటబుల్ ట్రస్టు తరఫున ఈ అవార్డులను అందజేస్తామన్నారు. త్వరలోనే సీనియర్ పాత్రికేయులతో కమిటీ ఏర్పాటు చేసి, ఆంగ్ల, హిందీ భాషలతో పాటు దేశవ్యాప్తంగా ప్రాంతీయ భాషల్లో పనిచేస్తున్న ఉత్తమ పాత్రికేయులను గుర్తించి అవార్డులను అందజేస్తామని తెలిపారు. ఒక్కో ఏడాది ఒక్కో రాష్ట్రంలో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. రామోజీ స్మారక అవార్డుకు ఎంపికైన వారికి రూ.20 వేల నగదుతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందజేస్తామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా బీజేపీ నేత సిరిపురపు తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌లో సాంకేతిక లోపం...

- వందేభారత్ రైలు 4 గంటలు ఆలస్యం

విశాఖపట్నం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (208 33) శనివారం నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. ఈ రైలు రోజూ ఉదయం 5.45 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరాలి. అయితే ప్లాట్‌ఫారం పైకి తీసుకువచ్చాక సీ-9 కోచ్‌లో సాంకేతిక లోపం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దానిని సరిచేసి పంపించేసరికి ఉదయం పది గంటలైంది. ఇటీవల కాలంలో వందే భారత్ రైలులో తరచూ సమస్యలు వస్తుండటం గమనార్హం.

టీడీపీతో టచ్‌లోకి వైసీపీ కౌన్సిలర్లు...?

- భవిష్యత్తుపై బెంగ
- ప్రాధాన్యం ఇస్తే వచ్చేస్తాం
- కీలక నాయకుల ద్వారా రాయబారాలు
- ఎమ్మెల్యే నిర్ణయం కోసం ఎదురుచూపులు

పుత్తూరు అర్బన్, జూన్ 22: పుత్తూరు మున్సిపాలిటీలో వైసీపీకి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత నెలలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని చవిచూసింది. దీంతో పూర్తి నైరాశ్యంలో కూరుకుపోయిన వైసీపీ కౌన్సిలర్లు భవిష్యత్తుపై బెంగతో టీడీపీ కీలక నాయకులతో టచ్‌లోకి వెళుతున్నట్లు సమాచారం. తగిన ప్రాధాన్యం ఇస్తే టీడీపీ గూటికి చేరేందుకు సిద్ధంగా ఉన్నామని రాయబారాలు పంపు తున్నారు. తమ అభిమతాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు చేర వేయాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 27వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే భానుప్రకాష్ హాజరవుతున్నారనే సమాచారంతో ఉత్కంఠ నెలకొంది.

ఏటికి ఎదురీదలేం

ఇంత ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న పార్టీలో ఇక భవిష్యత్తు ఉండదనే అంచనాకు వచ్చిన కౌన్సిలర్లు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసిన రెండు రోజుల తరువాత మాజీ ఎమ్మెల్యే రోజా నగరిలో పుత్తూరుకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. అందరూ కలిసి కట్టుగా ఉండాలని, టీడీపీ ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోను పార్టీ మారవద్దని హితవు పలికారు. అయితే ఈ స్వాంత వచనాలు కౌన్సిలర్లకు రుచించినట్లు కనిపించడం లేదనే మాటలు వినబడుతున్నాయి. మునిగిపోయే పడవలో ప్రయాణం చేయలేమనే నిర్ణయానికి వచ్చేశారు. మరో ఐదేళ్లు ఏటికి ఎదురీదలేమని చెప్పుకుంటున్నారు.

మేం వచ్చేస్తాం

ఇదిలా ఉండగా పలువురు కౌన్సిలర్లు టీడీపీ నాయకులతో టచ్‌లోకి వెళుతున్నారు. మొత్తం 27మంది కౌన్సిలర్లుండగా వైసీపీ నుంచి 22 మంది గెలిచారు. వీరిలో ఇప్పటికే 9 మంది టీడీపీ కండువా కప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నామని రాయబారాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. సిట్టింగ్ కౌన్సిలర్, పార్టీకి చెందిన ఒక నాయకుడితో ముగ్గురు, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఒక మహిళా కౌన్సిలర్‌తో మరో ముగ్గురు టచ్‌లోకి వచ్చారు. అలాగే ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు సన్నిహితంగా ఉండే మరో ఇద్దరు నాయకులతో కూడా పలువురు కౌన్సిలర్లు చర్చలు జరుపుతున్నారు. తమకు తగిన ప్రాధాన్యం కల్పిస్తే టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని మనసులోని మాటను బయటపెడుతున్నారు.

ఎమ్మెల్యే భానుప్రకాష్ అనుమతి కోసం

వైసీపీ కౌన్సిలర్ల అభిమతాన్ని ఎమ్మెల్యే భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లేందుకు టీడీపీ నాయకులు సిద్ధమవుతున్నారు. తొలి నుంచి టీడీపీకి పుత్తూరు గట్టి పట్టున్న పట్టణం. అసెంబ్లీ ఎన్నికల్లో మున్సిపాలిటీ పరిధిలో టీడీపీకి 12,827 ఓట్ల రికార్డు మెజార్టీ వచ్చింది. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుత్తూరును అభివృద్ధి చేసేందుకు గట్టి పట్టుదలతో ఉన్నారు. ఈ క్రమంలో కలిసి వస్తామని ప్రతిపాదనలు పంపుతున్న వైసీపీ కౌన్సిలర్ల విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారనే విషయం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఆయన నిర్ణయంపై మున్సిపాలిటీ పాలకవర్గం భవితవ్యం ఆధారపడి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 27వ తేదీన మున్సిపల్ పాలకవర్గ సమావేశానికి ఎమ్మెల్యే భానుప్రకాష్ హాజరవు తున్నారనే సమాచారంతో వైసీపీ నాయకుల్లో కలవరపాటు మొదలైందనే చర్చ జరుగుతోంది.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూన్ 22: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 22: మండలంలో ఆదివారం నుంచి జరిగే సమాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలని ఉపాధి హామీ పథకం అంబుడ్స్‌మన్ రాసరాయ నాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 2023 - 24 సంవత్సరంలో 720 పనులకు ఖర్చు చేసిన రూ.6.30 కోట్లకు సంబంధించిన సామాజిక తనిఖీ, ఉపాధి సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబుడ్స్‌మన్ మాట్లాడుతూ సామాజిక తనిఖీ మండలంలో వారం రోజులు పాటు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను సామాజిక తనిఖీ సిబ్బందికి పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు ఎస్ఆర్పీ వెంకయ్య, డీఆర్పీలు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులను కలిసిన టీడీపీ నేతలు



మంత్రి అచ్చెన్నాయుడికి ముక్కంటి ప్రసాదాలు అందజేస్తున్న టీడీపీ నేతలు

శ్రీకాళహస్తి, జూన్ 22: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కేవీబీపురం టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు కనపర్తి గోపీనాథ రెడ్డి, సీనియర్ నేతలు కిషోర్ కుమార్ రెడ్డి, సురేష్, మునిశంకర్, హరికృష్ణ శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, ప్రొటెం స్పీకర్ బుచ్చ య్య చౌదరి, స్పీకర్ అయ్యన్న పాత్రుడును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానం

కేవీబీపురం, జూన్ 22: మండలంలో పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ వ్యవస్థలు దెబ్బతినడంతో మురుగునీరు ఎక్కడికక్కడే తిష్టవేసి దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా మఠం, కాట్రపల్లె దళితవాడ, పెరిందేశం గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో అతిసారా ప్రబలుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

శ్రీకాళహస్తి, జూన్ 22: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో విద్యుత్‌శాఖ సిబ్బంది వీధి దీపాలకు మరమ్మతు పనులను వేగవంతం చేశారు. శనివారం 20వ వార్డు పరిధిలో టీడీపీ నేత మీర్జా ఆధ్వర్యంలో సుమారు 20వీధి దీపాలకు మరమ్మతులు చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు అర్జీలిచ్చినా అధికారులు పట్టించుకోలేదని, ఎమ్మెల్యే ఆదేశాలతో మరమ్మతులు చేయడం సంతోషకరమని స్థానికులు అన్నారు.